

జెండా ఊపి, ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలనే లక్ష్యం

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి రూరల్, జూన్ 19: సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో వైద్యాధికారులు, సిబ్బంది పనిచేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. ప్రపంచ సికిల్‌సెల్ ఎనీమియా నివారణ దినాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు జెండా ఊపి, ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దేశవ్యాప్తంగా సికిల్‌సెల్ ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో 0-40 సంవత్సరాల వయసున్న వారికి అవగాహన, రోగనిర్ధారణ పరీక్షలు, కౌన్సెలింగ్ ద్వారా వ్యాధి నిర్మూలనే మిషన్ ప్రధాన ఉద్దేశమన్నారు. హిమోగ్లోబిన్ తక్కువ ఉన్నవారు.. ఈవ్యాధి బారిన పడతారన్నారు. వ్యాధిని సకాలంలో గుర్తించి, చికిత్స ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. 0-40 సంవత్సరాల మధ్య వయసు వారు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. రక్తహీనత, కళ్లు పసుపురంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు, కీళ్ల నొప్పులు, శ్వాసతీసుకోవడంలో ఇబ్బందులు, అలసట, తరచూ అంటువ్యాధులు సోకడం, గర్భదారణ సమయంలో అనేక సమస్యలు తలెత్తడం, అవయవ వైఫల్యం, పెరుగుదలలో సమస్యలు ఈవ్యాధి లక్షణాలన్నారు. ఇది తీవ్రంగా మారకనే నిరోధించడమే ఉత్తమమైన మార్గమని కలెక్టర్ తెలియజేశారు. అనంతరం ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మంజువాణి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి మోహన్‌రాం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మడకశిర సమీపాన పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

కుండపోత

పుట్టపర్తి రూరల్, జూన్ 19: జిల్లాలో వరుస కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కూడా కుండపోత వర్షం కురిసింది. హిందూపురం, మడకశిర ప్రాంతాల్లో దంచికొట్టింది. దీంతో పలు చెక్‌డ్యాంలు నిండాయి. పట్టణాల్లోని రోడ్లు జలమయమయ్యాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ భారీ వర్షాల కారణంగా పంటల సాగు విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయ వర్గాలు పేర్కొంటున్నాయి. మంగళవారం రాత్రి హిందూపురంలో అత్యధికంగా 74.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రకటన ద్వారా తెలిపారు. మడకశిర 68.4, కొత్తచెరువు 41.2, లేపాక్షి 36.8, అమరాపురం 30.4, బుక్కపట్నం 24.2, పరిగి 22.4, చిలమత్తూరు 18.6, తనకల్లు 18.4, గుడిబండ 15.2, నంబులపూలకుంట 12.8, నల్లచెరువు 12.4, అమడగూరు 9.6, నల్లమాడ 9.4, చెన్నేకొత్తపల్లి 7.8, రొళ్ల 6.4, గోరంట్ల 6.2, రామగిరి 4.8, పుట్టపర్తి 4.2, రొద్దం 3.4, సోమందేపల్లి 2.2, ధర్మవరం లో 1.4 మి.మీ వర్షం కురిసినట్లు వారు వెల్లడించారు.



రొద్దం మండలం ఆర్ కొట్టాలలో కేంద్ర బృందానికి సమస్యలు వివరిస్తున్న రైతులు

ఉపాధి పథకానికి అనుసంధానం చేయండి



ఉపాధి హామీ పథకానికి వ్యవసాయాన్ని అనుసంధానం చేయాలి. అప్పుడే రైతులకు మేలు చేకూరుతుంది. కేంద్ర కరువు బృందం వచ్చినప్పుడల్లా ఇదే విషయాన్ని కోరుతున్నాం. కేంద్రం ఆ దిశగా ఆలోచన చేయట్లేదు. కేంద్ర బృందం సభ్యులు వస్తున్నారు.. రాసుకుని వెళ్తున్నారు తప్ప.. రైతులకు చేకూరిన మేలు ఏమీ లేదు. ఈసారైనా రైతులను ఆదుకునేలా నివేదిక ఇవ్వండి.

\- నరసింహులు, రొద్దం

పెట్టుబడి కూడా చేతికందలేదు



మూడెకరాలు కౌలుకు తీసుకుని, పప్పుశనగ సాగు చేశా. రూ.45వేలు పెట్టుబడి పెట్టా. పంట తీవ్రంగా దెబ్బతింది. పెట్టుబడి కూడా చేతికందలేదు. కౌలుకు పంటలు సాగుచేయకూడదని నిర్ణయించుకున్నా. కౌలు రైతులకు న్యాయం చేయండి. నష్టపోయిన పంటకు పూర్తిస్థాయిలో పరిహారం అందేలా చూడండి.

\-సిద్దన్న, కౌలురైతు

ఆదుకోకపోతే.. వ్యవసాయాన్ని వదులుకుంటాం..

మాగోడు కేంద్రానికి వినిపించండి
కేంద్ర కరువు బృందానికి రైతుల విన్నపాలు

ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఆదుకోకపోతే వ్యవసాయాన్ని వదులుకోవాల్సిన దుస్థితి దాపురిస్తుందని రైతులు.. కేంద్ర కరువు బృందానికి స్పష్టం చేశారు. కేంద్ర కరువు బృందం బుధవారం రొద్దం మండలంలో పర్యటించింది. ఆర్. కొట్టాల, చెరుకూరు గ్రామాల పరిధిలో రబీలో పప్పుశనగ సాగుచేసి, నష్టపోయిన రైతులతో కేంద్ర బృందం సభ్యులు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఆర్. కొట్టాలలో రైతులు పలు సమస్యలను కరువు బృందం దృష్టికి తీసుకెళ్లారు. వీటిని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని విన్నవించారు. ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు చేతికందక తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోయారు. అప్పులు పెరిగిపోయాయనీ, తీర్చే మార్గం కనిపించట్లేదన్నారు. మళ్లీ పంట పెట్టేందుకు కూడా పైసా లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదుకోకపోతే తాము వ్యవసాయాన్ని వదులుకుని, వేరే పనులు చూసుకుంటామని రైతులు స్పష్టం చేశారు.

\- హిందూపురం

పండ్లతోటలకు రాయితీలు ఇవ్వాలి



వర్షాభావంతో రబీ పంటలు దెబ్బతింటున్నాయి. రైతులకు నష్టాలు తప్పట్లేదు. దీంతో చాలామంది పండ్లతోటల వైపు మళ్లారు. అలాంటి వారికి రాయితీలు కల్పించి, ప్రోత్సహించాలి. ఉపాధిహామీ పథకం కింద పండ్లతోటలకు మరింత లాభం చేకూరేలా నిబంధనలు సడలించాలి.


\-శ్రీనివాసరెడ్డి, రైతు

నోరు మెదపకుండానే..

వచ్చారు.. చెప్పింది విన్నారు.. వెళ్లారు..
రైతులతో మాట మాటాడని కరువు బృందం



హిందూపురం, జూన్ 19: రబీలో పంటలు నష్టపోయిన రైతుల బాధలు కళ్లారా చూడటానికి వచ్చిన కేంద్ర కరువు బృందం సభ్యులు కనీసం మాట మాటాడకపోవడం గమనార్హం. రొద్దం మండలంలోని ఆర్.కొట్టాల చెరుకూరులో రైతులతో వారు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడును కేంద్ర బృందం వద్ద విన్నవించుకున్నారు. కేంద్ర బృందం సభ్యులు మాత్రం రైతులు చెప్పిన దానిని రాసుకుని వెళ్లారు తప్ప.. నోరు విప్పి మాట మాట్లాడింది లేదు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ రబీలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించాలని రైతులకు సూచించారు. రైతులు మాట్లాడుతూ.. మండలంలో పప్పుశనగ సాగు చేశామనీ, ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడి పెట్టామనీ, అది కూడా చేతికి అందలేదని వాపోయారు. మొదట కొట్టాల గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రైతులు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలనీ, తద్వారా రైతులకు పెట్టుబడి తగ్గుతుందన్నారు. మండలంలో పాడిరైతులు అధికంగా ఉన్నారనీ, ప్రభుత్వ డెయిరీ లేక గిట్టుబాటు ధర దక్కక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధర దక్కక వ్యవసాయమే వద్దనుకునే పరిస్థితికి రైతన్నలు వచ్చారన్నారు. రైతు రైతుగా ఉండాలంటే కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ డెయిరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయినపుడు రైతన్నలు పూర్తిస్థాయిలో ఆదుకోవాలనీ, లేదంటే ఆ రైతన్న మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతాడన్నారు. ప్రతిసారీ కేంద్ర బృందం వస్తుంది, వెళ్తుంది తప్ప.. రైతులకు సంబంధించి దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుని, రైతులను ఆదుకోవాలన్నారు. రబీ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వాటిల్లిన పంటనష్టాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ సందర్భంగా కేంద్ర బృందంలోని సభ్యులు మాట్లాడుతూ.. రైతులు చెప్పిన విషయాలన్నీ కేంద్రం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మండలంలో 656 హెక్టార్లలో పప్పుశనగ పంట నష్టంపై నివేదిక రూపంలో వ్యవసాయాధికారులు సమర్పించారు. రొద్దం మండలం నుంచి 503 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరవుతుందని తెలిపారు. కేంద్ర బృందంలో కేంద్ర వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి, సీఈఓ రితేష్‌చౌహాన్, హైదరాబాద్ డీటీఈ, ఆయిల్‌సీడ్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పొన్నుస్వామి, ఢిల్లీకి చెందిన వ్యవసాయశాఖ ఫార్మర్స్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సునీల్‌దూబే, రాష్ట్ర విపత్తు సంస్థల విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు, ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కొత్తచెరువు మండలం మరుకుంటపల్లి-పోతులకుంట రోడ్డు

ఇరగంపల్లి నుంచి తలమర్ల, మీర్జాపురం వెళ్లే రహదారి

నరకదారులు!

వైసీపీ పాలకులు రోడ్ల అభివృద్ధిపై చూపిన తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనాలు ఈ రోడ్లు. పల్లె రోడ్లే కాదు, పట్టణాలను కలిపే ప్రధాన రహదారులు కూడా దారుణంగా తయారయ్యాయి. నరకదారులుగా మారిపోయాయి. గోతుల్లాంటి గుంతలు ఏర్పడిన, కంకర పరిచి వదిలేసిన రోడ్లలో ప్రయాణించాలంటే జనం నిత్యనరకం అనుభవిస్తున్నారు. వాహనాలు ఎక్కడ అదుపుతప్పి కిందపడతాయోనని భయంభయంగా ప్రయాణిస్తున్నారు. వైసీపీ పాలకులకు శాపనార్థాలు పెడుతున్నారు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికైనా ఈ రోడ్లకు మోక్షం కలుగుతుందని ఆశిస్తున్నారు.


\- కొత్తచెరువు/నంబులపూలకుంట

కొత్తచెరువు మండలంలోని ఇరగంపల్లి నుంచి తలమర్ల, మీర్జాపురం వెళ్లే రోడ్డుకు కంకర వేసి, వదిలేశారు. గత టీడీపీ ప్రభుత్వం తారురోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మట్టి రోడ్డు వేసింది. తీరా తారు రోడ్డు వేసే సమయానికి ఎన్నికలు రావడం, 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో రోడ్ల నిర్మాణం ఆగిపోయింది. ఐదేళ్లలో అడుగు కూడాముందుకు పడలేదు. గులక రాళ్లపైనే నడక, ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. పలువురు ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారినపడి ఆస్పత్రుల పాలయ్యారు.



▲ దేవరచెరువు వంక వద్ద బురదలో కూరుకుపోయిన ఆటో

రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు నంబులపూలకుంట మండలంలో కదిరి-రాయచోటి ప్రధాన రహదారి దారుణంగా తయారైంది. నంబులపూలకుంట నుంచి సోలార్ ప్లాంట్‌కు వెళ్లే దారి పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గోతుల్లా తయారయ్యాయి. బుధవారం దేవర చెరువుకు వెళ్లే వంకదారిలో ఆటో బురదలో కూరుకుపోయింది. పక్కనున్న పొలాల్లో వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని వాహనదారులు వాపోతున్నారు.



కొత్తచెరువు మండలంలోని మరుకుంటపల్లి నుంచి పోతులకుంటకు వెళ్లే రోడ్డు పరిస్థితి కూడా అంతే. టీడీపీ హయాంలో కంకర వేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పూర్తిగా వదిలేశారు. ఐదేళ్లు కంకరపైనే ప్రయాణించాల్సి వచ్చిందని ప్రజలు వాపోతున్నారు. ఎవరైనా అనారోగ్యం బారినపడితే ఆస్పత్రులకు తరలించడానికి 108 వాహనం కూడా గ్రామానికి రావడానికి వెనుకంజ వేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

మంత్రులకు బీకే అభినందనలు



ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ బీకే

పుట్టపర్తి, జూన్19 (ఆంధ్రజ్యోతి): పదవీ బాధ్యతలను చేపట్టిన రాష్ట్ర మంత్రులను హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి అభినందనలు తెలిపారు. బుధవారం అమరావతిలో హోంమంత్రి వంగలపూడి అనిత, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని బీకే మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్త మంత్రులకు శుభాకాంక్షలు తెలిపారు.

సారు.. ఫ్యాన్స్..!

వైసీపీ నాయకుల సమక్షంలో సెలబ్రేషన్స్
మంత్రి నియోజకవర్గానికి వచ్చిన రోజునే పోలీసు అధికారి నిర్వాకం
బత్తలపల్లి పోలీసు స్టేషన్‌లో తంతు ఆలస్యంగా వెలుగులోకి..

పోలీసు స్టేషన్‌లో సీఐ పుట్టినరోజు వేడుక



పోలీసు స్టేషన్‌లో పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న సీఐ, వైసీపీ నాయకులు

ధర్మవరం, జూన్ 19: ఆయనో పోలీసు అధికారి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ). తన పుట్టినరోజును ఘనంగా చేసుకున్నారు. ఆయన ఇంట్లోనో, ఫంక్షన్ హాల్‌లోనో అయితే.. ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఏకంగా పోలీసు స్టేషన్‌నే అందుకు వేదికగా చేసుకున్నారు. అతిథులు ఆయన ఫ్యాన్స్..! అదే ఫ్యాన్ పార్టీ నాయకులు. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో ఫ్యాన్ పార్టీ వైసీపీ దారుణంగా ఓడిపోయింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అయినా ఆయన ఫ్యాన్ పార్టీ ఫ్యాన్స్ సమక్షంలో సెలబ్రేషన్స్ చేసుకోవడం విమర్శలకు తావిస్తోంది. ఆయనే ధర్మవరం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆరోహణరావు. బత్తలపల్లి పోలీసు స్టేషన్‌లోని సీఐ కార్యాలయంలో ఆయన పుట్టినరోజు వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా చేసుకున్నారు. అతిథులంతా వైసీపీ నాయకులే. విచిత్రమేమిటంటే నియోజకవర్గం నుంచి కూటమి తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన సత్యకుమార్ యాదవ్ మంత్రిగా బాధ్యతలు తీసుకుని, మంగళవారమే తొలిసారిగా నియోజకవర్గానికి వచ్చారు. నియోజకవర్గ సరిహద్దు నుంచి ధర్మవరం వరకు రోజంతా విజయోత్సవ ర్యాలీ చేశారు. బత్తలపల్లిలో వేలాదిగా తరలివచ్చిన కూటమి శ్రేణులు, అభిమానులు.. ఆయనకు ఘనస్వాగతం పలికారు. తన సర్కిల్ పరిధి కావడంతో సీఐ కూడా బందోబస్తు విధులకు హాజరయ్యారు. మంత్రి కార్యక్రమం అలా ముగిసిందో.. లేదో.. ఆ రాత్రికే సీఐ పుట్టినరోజు వేడుకలు అదీ.. వైసీపీ నాయకులతో కలిసి చేసుకోవడం గమనార్హం. ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా సీఐ వ్యవహరించారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. తన కార్యాలయాన్ని వైసీపీ ఆఫీసుగా మార్చారన్న విమర్శలూ లేకపోలేదు. ఈ నేపథ్యంలో వైసీపీ అధికారం కోల్పోయి, కూటమి ప్రభుత్వం కొలువుదీరినా ఆయన ఫ్యాన్ పార్టీపై అభిమానం చాటుకోవడంపై పోలీసు శాఖలోనే విమర్శలు వినిపిస్తున్నాయి. సీఐ పుట్టినరోజు వేడుకల నిర్వహణలో తీవ్ర అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న రైటర్ కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది.

30 మందికిపైగా అస్వస్థత

గుడిబండ, జూన్ 19: మండలంలోని ముతుకూరు గ్రామంలో నీరు కలుషితమై బుధవారం 30మందికిపైగా వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు లోనయ్యారు. బాధితులు కర్ణాటక, మడకశిర ఆస్పత్రులకు వెళ్లారు.


కలెక్టరేట్‌లో పంటనష్టంపై సమీక్షిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధులు

కేంద్ర బృందానికి ఏకరువు..!

- కరువు బృందానికి జిల్లా కష్టాలు చూపిన కలెక్టర్
- ఫొటోలు, వీడియోలతో వివరించిన అధికారులు
- గతేడాది జిల్లాలో రూ.56 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా

అనంతపురం టౌన్, జూన్ 19: అనంత కరువుపై జిల్లా అధికారులు కేంద్రబృందం ఎదుట ఏకరువు పెట్టారు. గతేడాది రబీసీజన్ సమయంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా 14 మండలాల్లో జరిగిన నష్టంపై ఫొటోలు ప్రదర్శిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్, వ్యవసాయశాఖ, భూగర్భజలశాఖ, పశుసంవర్థక శాఖ తదితర శాఖల అధికారులు వివరించారు. బుధవారం కేంద్రకరువు బృందం అధ్యయనకమిటీ టీమ్‌లీడర్ రితీష్ చౌహాన్, సభ్యులు ఐఏఎస్ చిన్మయ్ పుండ్లిక్‌రావ్ గోత్మారే, ఐఏఎస్ కూర్మనాథ్‌ల సమక్షంలో కరువుపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో గతేడాది 319.6 మి.మీ వర్షపాతం కురవాల్సి ఉండగా కేవలం 247.4 మి.మీ వర్షం కురిసిందన్నారు. దేశంలో జైసల్మీర్ తర్వాత అతి తక్కువ వర్షపాతం జిల్లాలో నమోదవుతుందన్నారు. 2023లో వర్షాలు తక్కువగా కురవడంతో భూగర్భజలాలు ఈఏడాది మేనాటికి 15.22 మీటర్ల లోతుకు వెళ్లాయన్నారు. తక్కువ వర్షపాతం వల్ల తుంగభద్ర కెనాల్‌నుంచి 32.5 టీఎంసీల నీటిని కేటాయించినా కేవలం 16,071 టీఎంసీల నీరు మాత్రమే విడుదల చేశారన్నారు. జిల్లాలో రబీ వ్యవసాయ విస్తీర్ణం 1,23,185 హెక్టార్లు ఉండగా గతేడాది తీవ్ర కరువు వల్ల 50నుంచి 70 శాతం పంట దెబ్బ తినిందన్నారు. 14మండలాల్లో 39,694 మంది రైతులకు సంబంధించి 53,014 హెక్టార్లకు రూ45.06 కోట్ల పంటనష్ట పరిహారానికి ప్రతిపాదనలు పంపామన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో 2,256 చేతిపంపులు ఎండిపోయాయని, ఉపాధి పనులు ఆగిపోయాయయన్నారు. పలువురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. కార్యక్రమంలో ఆయిల్‌సీడ్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పొన్నుస్వామి, అగ్రికల్చర్ అండ్ ఫార్మర్ డిప్యూటీ డైరెక్టర్ సేనీలదూబే, డ్రింకింగ్ వాటర్ శానిటేషన్ డిప్యూటీ డైరెక్టర్ ఆశిష్‌పాండే, రూరల్ డెవలప్‌మెంట్ సెక్రటరీ అరవిందకుమార్ సోనీ, ఏపీఎస్డీఎంఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగరాజు, గ్రౌండ్‌వాటర్ అసిస్టెంట్ డైరెక్టర్ విశ్వేశ్వరరావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ బ్రహ్మాజీ పాల్గొన్నారు.


పంట నష్టాన్ని వివరిస్తున్న వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ

నివేదిక అందజేశాం : కలెక్టర్

జిల్లాలో రబీలో జరిగిన నష్టంపై కేంద్ర బృందానికి నివేదిక అందజేశామని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. అధికారులతో సమీక్ష అనంతరం విలేకులతో మాట్లాడిన కలెక్టర్ గతేడాది వర్షాభావం కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర బృందం వచ్చిందన్నారు. జిల్లాలో పంటనష్టాలు, పశువులకు గడ్డితిప్పలు, తాగునీటి ఇబ్బందులు తదితర వాటిని కూలంకుశంగా వివరించామన్నారు. బోర్లు ఎండిపోవడంతో రైతులు పడిన కష్టాలను అధికారులకు తెలియజేశామన్నారురు. అనంతపురం, సత్యసాయి, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, ప్రకాశం జిల్లాల కరువుపై అధికారులు చర్చించారన్నారు. అనంత జిల్లాలో 14మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారన్నారు. ఇక్కడి కరువు పరిస్థితులను కళ్లారా చూపించామన్నారు. జిల్లాలో మరో రెండు రోజులు కేంద్ర బృందం పలు గ్రామాల్లో పర్యటించి, స్వయంగా నష్టాన్ని పరిశీలిస్తుందన్నారు. పూర్తి నష్టంపై కేంద్రానికి నివేదిక అందజేస్తారన్నారు.

సంక్షేమ పథకాలకు కొత్త పేర్లు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్19 : ఎస్సీ సంక్షేమశాఖ పరిధిలో అమలయ్యే పలు సంక్షేమ పథకాలకు కొత్త పేర్లను ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకు ఎస్సీ సంక్షేమశాఖ పరిధిలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలైన జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన, జగనన్న విదేశీ విద్యాదీవెన, వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్ఆర్ విద్యోన్నతి, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహాల పేర్లను మారుస్తూ ఆ శాఖ రాష్ట్ర అధికారులు జీఓ నంబర్ 4ను విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆ శాఖ జేడీ మధుసూదన్‌రావు బుధవారం వెల్లడించారు.

వైసీపీ ప్రభుత్వంలో పథకాల పేర్లు	కూటమి ప్రభుత్వంలో పథకాల పేర్లు
జగనన్న విద్యాదీవెన	పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ (రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీజ్)
జగనన్న వసతి దీవెన	పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ (మెయింటెనెన్స్ ఆఫ్ ట్యూషన్ ఫీజ్)
జగనన్న విదేశీ విద్యదీవెన	అంబేద్కర్ ఓవర్‌సీస్ విద్యానిధి
వైఎస్ఆర్ కళ్యాణమస్తు	చంద్రన్న పెళ్లికానుక
వైఎస్ఆర్ విద్యోన్నతి	ఎన్టీఆర్ విద్యోన్నతి
జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం	ఇన్సెంటివ్స్ ఫర్ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్

చీనీకాయలు టన్ను రూ.32 వేలు

అనంతపురంరూరల్, జూన్ 19: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.32 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 457 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.



అమిగోస్..ఖజానాకు.. లాస్..!


అమిగోస్ కార్యాలయం

- ఏడాదికి రూ.130 కోట్లకు లీజు
- రూ.65 కోట్లతో సరిపెట్టిన అమిగోస్ మినరల్స్
- లీజుదారులకు బెదిరింపులు
- వైసీపీ పెద్దల అండదండలతో రెచ్చిపోయిన వైనం
- తాజాగా ప్రధాన రికార్డుల తరలింపు దుమారం


భూగర్భ గనుల శాఖ కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19: జిల్లాలో ఖనిజ సంపదను కొల్లగొడుతున్న అమిగోస్ మినరల్స్ ప్రైవేటు సంస్థ ప్రభుత్వానికి చెల్లించాల్సిన లీజు మొత్తాన్ని ఎగ్గొట్టేందుకు పక్కా స్కెచ్ వేసింది. గతేడాది ఉమ్మడి జిల్లాలో ఖనిజ సంపద తవ్వకాలు, రవాణాకు సంబంధించి తిరుపతికి చెందిన అమిగోస్ మినరల్స్ సంస్థ రెండేళ్లకు రూ.260కోట్లకు లీజు అగ్రిమెంట్ చేసుకుంది. అయితే ప్రభుత్వానికి ఒక్క పైసా చెల్లించకుండానే ముందస్తుగా లీజుకు ఇచ్చేశారు. ఏడాది గడిచినా సవంత్సరానికి చెల్లించాల్సిన రూ.130కోట్లు చెల్లించకుండా కాలం వెల్లబుస్తున్నారు. దీంతో జిల్లా మైన్స్ అధికారి అమిగోస్ సంస్థ ఏడాది లీజు మొత్తాన్ని చెల్లించాలని ఇటు అమిగోస్ సంస్థకు, అటు మైన్స్ రాష్ట్ర డైరెక్టర్‌కు అప్పట్లో లేఖ పంపారు. అమిగోస్ మినరల్స్ ఏడాది మొత్తాన్ని చెల్లించకుంటే లీజు రద్దుతో పాటు నాలుగేళ్ల పాటు ఆ సంస్థ ఎక్కడా మైనింగ్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర మైన్స్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేసి అప్పట్లో చేతులు దులుపుకున్నారు. ఆ పరిస్థితుల్లో తమకు ఉన్న పలుకుబడితో అమిగోస్ సంస్థ ఎండీ... అప్పటి సీఎం, పెద్దమంత్రి దృష్టికి తీసుకెళ్ళి మైన్స్ రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాలను తొక్కిపెట్టేశారు. దీంతో చేసేది లేక మైన్స్ రాష్ట్ర డైరెక్టర్, జిల్లా అధికారులు అప్పట్లో మిన్నకుండిపోయారు. పైగా లీజు మొత్తాన్ని చెల్లించకుండా, స్థానికంగా లీజు దారుల నుంచి సుమారు జిల్లాలో రూ.100కోట్ల వరకు అక్రమ వసూళ్ల చేసినట్లు సమాచారం. లీజుదారుల నుంచి వసూలు చేసిన అమిగోస్ మినరల్స్ సంస్థ ప్రభుత్వానికి లీజు మొత్తాన్ని ఎందుకు చెల్లించడం లేదనేది అందరిలోనూ తలెత్తుతున్న ప్రశ్న. కరవు జిల్లాలో లభించే నాణ్యమైన ఖనిజాన్ని విచ్చలవిడిగా తవ్వకాలు చేపట్టి, అక్రమంగా అనుమతి లేని ప్రాంతాలకు తరలించడంతో జిల్లాకు, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడడం ఖాయం. ఈ పరిస్థితుల్లో తాజాగా కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో అమిగోస్ మినరల్స్ ప్రైవేటు సంస్థ రహస్యంగా ప్రధాన రికార్డులు, ఫైల్స్ తరలింపు ఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో స్పందించిన మైన్స్ అధికారులు రికార్డుల తరలింపును అడ్డుకుని అమిగోస్ ఆగడాలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేశారు. కొత్త ప్రభుత్వ యంత్రాంగం అమిగోస్ సంస్థపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

ఏడాదికి రూ.130 కోట్లకు లీజు

ఉమ్మడి జిల్లాలో లభించే ఖనిజ సంపద ఆధారంగా నెలకు రూ.11కోట్లతో ఏడాదికి రూ.130కోట్లతో అమిగోస్ మినరల్స్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అప్పజెప్పింది. జిల్లాలో మాత్రం నెలకు రూ.20-30 కోట్ల వరకు ఖనిజ సంపదతో ప్రభుత్వానికి ఇదివరకు ఆదాయం వచ్చేదని చెబుతున్నారు. అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి, పెద్దమంత్రికి అత్యంత సమీప బంధువు కావడంతోనే అమిగోస్ సంస్థకు బినామీ పేర్లతో లీజుకు ఇచ్చారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది. పైగా వచ్చే ఆదాయంలో అప్పటి సీఎంకు, అప్పటి పెద్దమంత్రికి సైతం వాటాలు ఉన్నట్లు ఆశాఖలో చర్చించుకుంటున్నారు. అంతేగాక ఇదివరకు లీజు పొందిన కాంట్రాక్టర్లు సైతం ఇదే విషయాన్ని గట్టిగానే ఆశాఖ అధికారుల ఎదుటే వాదిస్తున్నారు. ఏది ఏమైనా జిల్లాలో లభించే ఖనిజ సంపదను రాయల్టీ పేరుతో జిల్లా అభివృద్ధికే వినియోగించాలనేది లీజు కాంట్రాక్టర్లకు ఇచ్చే అగ్రిమెంట్‌లోనే ఉంటుంది. ఈ నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వానికి ఆదాయాన్ని గండికొడుతూ, లీజు మొత్తాన్ని చెల్లించకుండా, ఇతర ప్రాంతాలకు జిల్లాలోని ఖనిజ నిల్వలను అక్రమంగా తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లేఖ రాసినా.. లెక్క చేయలేదు..

ప్రభుత్వ ఆదాయానికి అనుగుణంగా, లీజు మొత్తాన్ని చెల్లించకుండా అమిగోస్ మినరల్స్ సంస్థ కాలం గడుపుతూ వస్తోంది. ప్రభుత్వానికి ఏడాది లీజు రూ.130కోట్లు చెల్లించాలంటూ...సాక్షాత్తు భూగర్భ గనుల శాఖ డీడీ మైన్స్ డైరెక్టర్‌కు గత ఫిబ్రవరి 7వతేదీన లేఖ రాశారు. దీంతో ఏడాది మొత్తం లీజు చెల్లిస్తేనే కాంట్రాక్ట్ కొనసాగించాలి...లేదంటే అమిగోస్ మినరల్స్ సంస్థ లీజును రద్దు చేస్తామంటూ, నాలుగేళ్లపాటు ఎక్కడా మైనింగ్ చేయకుండా బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలంటూ మైన్స్ డైరెక్టర్ నుంచి డీడీ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేశారు. ఇదే విషయంలోనే అప్పట్లో ఉన్న పెద్దమంత్రికి, అప్పటి మైన్స్ రాష్ట్ర డైరెక్టర్‌కు మధ్య మనస్పర్థలు వచ్చినట్లు సమాచారం. మైన్స్ డైరెక్టర్‌కు రావాల్సిన కమీషన్ రాకుండా పెద్దమంత్రి అడ్డుకుంటున్నారనే భావనతో వారి మధ్య అప్పట్లో బేధాభిప్రాయాలు వచ్చాయని గుసగుసలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో అమిగోస్ అక్రమ వసూళ్ల పర్వం

ఉమ్మడి జిల్లాలో అగ్రిమెంట్ లీజు పేరుతో అమిగోస్ మినరల్స్ సంస్థ స్థానిక కాంట్రాక్టర్లు, ఇతరుల రవాణా దారుల నుంచి అక్రమంగా వసూళ్లకు అప్పట్లో తెరలేపారు. ఏడాది కాలంలోనే వివిధ కాంట్రాక్టర్ల నుంచి రూ.100కోట్లు వసూలు చేసినట్లు చెబుతున్నారు. ఇప్పటికే బాధిత లీజు కాంట్రాక్టర్లు జిల్లా, రాష్ట్ర మైన్స్ అధికారుల దృష్టికి అప్పట్లో తీసుకెళ్ళినా ఫలితం లేకపోవడం గమనార్హం. పలుమార్లు ఫిర్యాదులు వెళ్ళినా సాక్షాత్తు అప్పటి సీఎం, అప్పటి పెద్దమంత్రులు అమిగోస్ సంస్థను కాపాడుతూ వస్తున్నారనేది బహిరంగ రహస్యం. అప్పటి సీఎం, పెద్దమంత్రుల అండదండలతోనే ప్రభుత్వ ఆదాయానికి, జిల్లాలో ఖనిజ సంపదను కొల్ల గొట్టేందుకు అమిగోస్ మినరల్స్ సంస్థ యత్నిస్తోందనే ప్రచారం అప్పట్లో బాగానే సాగింది. స్థానిక కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేస్తున్న అమిగోస్ మినరల్స్ సంస్థ ప్రభుత్వానికి ఎందుకు లీజు సొమ్ము చెల్లించడం లేదనేది బాధిత కాంట్రాక్టర్లు, మైన్స్ అధికారుల వద్ద వినిపిస్తున్న వాదన.

ప్రభుత్వానికి ప్రతి పైసా చెల్లించాల్సిందే
: నాగయ్య, జిల్లా భూగర్భగనుల శాఖ డీడీ



ప్రభుత్వానికి రావాల్సిన లీజు మొత్తం అమిగోస్ మినరల్స్ సంస్థ కచ్చితంగా చెల్లించాల్సిందే. బకాయిలతో పాటు ఇప్పటి వరకు లీజుదారుల నుంచి వసూలు చేసిన మొత్తం సొమ్మును అమిగోస్ సంస్థ ప్రభుత్వ ఖాతాలో జమచేయాలి. లేదంటే శాఖాపరమైన చర్యలు, ఇతర అంశాలపై ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ఉంటాయి. ఇందులో ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదు. రికార్డుల తరలింపు, ఇతర అంశాలపై అమిగోస్ సంస్థపై వస్తున్న ప్రచారాలకు స్పష్టి చెబుతాం. అమిగోస్ సంస్థకు సంబంధించిన ప్రతి రికార్డులు, ఫైల్స్‌ను స్వాధీనం చేసుకుని ప్రభుత్వానికి అందజేస్తాం.

నూతన చట్టాలపై 22, 23 తేదీల్లో అవగాహన

- సదస్సుకు హాజరు కానున్న హైకోర్టు న్యాయమూర్తులు

: జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, జూన్ 19: దేశంలో కొత్తగా అమలు చేయబోతున్న చట్టాలపై శని, ఆదివారాల్లో ఉమ్మడి జిల్లాలోని న్యాయవాదులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ తెలిపారు. బార్ అసోసియేషన్ సమావేశపు హాల్‌లో న్యాయవాదులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌తో కలిసి మాట్లాడారు. బ్రిటిష్ కాలంలో రూపొందించిన ఇండియన్ పీనల్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ చట్టాలు నేటికీ దేశంలో అమలు అవుతున్నాయన్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఈ పాత చట్టాలను రద్దు చేసిందన్నారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధ్యయన అనే మూడు కొత్త చట్టాలను జూలై నుంచి దేశవ్యాప్తంగా అమలు చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఆ కొత్త చట్టాలపై న్యాయవాదులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శని, ఆదివారాల్లో నిర్వహించే ఈ అవగాహన సదస్సుకు హైకోర్టు న్యాయమూర్తులు హాజరు అవుతున్నారని, దీనికి ఉమ్మడి జిల్లాలోని న్యాయవాదులు హాజరు కావాలని కోరారు.

అన్నా.. నాకే ఇవ్వాలి..

- ఫీల్డ్ అసిస్టెంట్, డీలర్ పోస్టులకు భారీ డిమాండ్
- గ్రామాల్లో లాబీయింగ్ మొదలు పెట్టిన ఆశావహులు
- తలలు పట్టుకుంటున్న ద్వితీయశ్రేణి నేతలు



బుక్కరాయసముద్రం, జూన్ 19: కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఫీల్డ్ అసిస్టెంట్, డీలర్ల పోస్టులకు ఆశావహుల్లో పోటీ పెరిగిపోయింది. ఎన్నడూ లేని పలు గ్రామాల్లో తమకంటే తమకే పోస్టులు ఇప్పించాలని శింగనమల నియోజక వర్గంగా టీడీపీ కార్యకర్తలు పోటాపోటీగా లాబీయింగ్ చేస్తున్నారు. ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై ద్వితీయశ్రేణి నాయకత్వానికి తలపోటుగా మారింది. ప్రధానంగా బుక్క రాయసముద్రం, నార్పల, శింగనమల, గార్లదిన్నె, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు ఒక్కో గ్రామంలో పది నుంచి 15 మంది పోటీ పడుతున్నారు. పోటీపడే వారంతా ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేసిన వారే ఉన్నారు. రేషన్ డీలర్ల నియామకానికి కూడా ఇదే స్థాయిలో పోటీ నెలకొంది. గత ప్రభుత్వం గ్రామ వలంటీర్ వ్యవస్థ పెట్టిన విషయం తెలిసిందే. ఆ ప్రభుత్వంలో రూ.5 వేలు వేతనం ఇచ్చేవారు. కాగా ఎన్నికలకు ముందు చంద్రబాబు తమ ప్రభుత్వం వస్తే గ్రామ వలంటీర్ వ్యవస్థ కొనసాగిస్తానని, వారికి రూ.10వేలు వేతనం హామీ ఇచ్చారు. దీంతో ఇప్పుడు గ్రామాల్లో ఆ వలంటీర్ పోస్టుకూ పోటీ తీవ్రమైంది.

ఆఫర్లు ప్రకటిస్తున్న ఆశావాహులు..

నియోజకవర్గంలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను దక్కించుకోవాలనే తపనతో ఆశావాహులు ద్వితీయ శ్రేణి నేతలకు ఆఫర్లు ప్రకటిస్తున్నట్లు సమాచారం. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు ఒక్కో గ్రామంలో 10 నుంచి 15 మందిదాకా పోటీ పడుతున్నారు. వారు ఆ పోస్టుకు రూ.లక్షలు ఇచ్చేందుకూ వెనకాడడం లేదు. దీనిని బట్టి చూస్తుంటే ఈ పోస్టుకు ఎంత డిమాండ్ ఉందో.. అర్థం చేసుకోవచ్చు. కొన్ని గ్రామాల్లో అయితే వచ్చే సర్పంచ్, లేదా ఎంపీటీసీ ఎన్నికల ఖర్చు తమకే వదలేయండనీ, అంతా తామే చూసుకుంటామని కూడా హామీ ఇస్తున్నట్లు తెలుస్తోంది. పోటీ ఎక్కువవుతుండడంతో ఆశావహులు ఎవరికి వారే... తమ రూట్‌లో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వద్దకు సైతం క్యూ కడుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో ఎమ్మెల్యే ఇంటి వద్దకు వెళ్లి తమ ప్రయత్నాలు చేసుకోవడంలో నిమగ్నమవుతున్నారు.

ఎంతైనా సరే...

బుక్కరాయసముద్రం మండలంలోని ఓ గ్రామ పంచాయతీలో వైసీపీ నేత ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు తమ అనుచరుడికి ఇవ్వాలని, అందుకు ఎంత ఖర్చు అయినా సరే వెనకాడేది లేదని అంటుండడం మండలంలో తీవ్ర చర్చకు తెరలేపుతోంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి ఆ గ్రామ పంచాయతీ నేతలు తీసుకెళ్లగా... వైసీపీ వర్గీయులకు ఇచ్చే ప్రసక్తే లేదని, ఎక్కడ ప్రయత్నాలు చేసినా ఉపయోగం లేదని ఆమె సూటిగా చెప్పినట్లు సమాచారం.

సమష్టి నిర్ణయంతోనే ఎంపిక..

ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికే తగిన గుర్తింపు ఇచ్చి న్యాయం చేసే విధంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ముందుకు వెళ్లనున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం అనంతరం మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి, మండల, గ్రామ నేతల సమష్టి నిర్ణయం అనంతరమే పోస్టులు భర్తీ చేస్తానని ఆమె నియోజకవర్గ టీడీపీ నేతలకు సూచించినట్లు సమాచారం. ఎక్కడైనా పోస్టులకు గ్రామ స్థాయి టీడీపీ నేతలకు డబ్బు ఇచ్చి తెచ్చు కున్నారంటే.. మళ్లీ అయినా తొలగిస్తానని హెచ్చరించినట్లు తెలిసింది. పార్టీకి చెడ్డ పేరు వస్తే సహించేది లేదని, నేతల సమక్షంలోనే పోస్టులను భర్తీ చేస్తామని చెప్పినట్లు సమాచారం.

హెచ్చెల్సీ మరమ్మతులకు రూ.48 లక్షలతో ప్రతిపాదనలు: ఎస్ఈ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో హెచ్చెల్సీ కాలవకు నీటి విడుదల చేసేలోగా రూ.48లక్షలతో అత్యవసర పనులు చేపట్టాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తుంగభద్ర ఎగువకాలవ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. అత్యవసర మరమ్మత్తు పనులపై బుధవారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని కార్యాలయంలో ఇంజనీర్లతో ఎస్ఈ రాజశేఖర్ సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా హెచ్చెల్సీ 119 కిలోమీటరు వద్ద రూ.30లక్షలతో అండర్ టన్నెల్, 181కిలోమీటరు నింబగల్లు దెబ్బ తిన్న కాలవకు వద్ద రూ.10లక్షలతో మరమ్మత్తు పనులు, 112కిలో మీటరు బొమ్మనహాల్ వద్ద గండి పూడ్చివేతకు రూ.10లక్షలు మొత్తం రూ.48లక్షల పనులకు ప్రతిపాదనలు పంపామన్నారు. జూలై 20వతేదీ టీబీ డ్యాం నుంచి హెచ్చెల్సీకి నీటి విడుదల లోపు ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ ఏడాది టీబీ డ్యాంలో 172టీఎంసీల నీటి నిల్వ ఆధారంగా హెచ్చెల్సీకి 26.368 టీఎంసీల నీరు కేటాయించారని పేర్కొన్నారు. నీటి నిల్వ, కేటాయింపుల్లో జాగ్రత్తలు పాటించి నీరు వృథా కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ డిప్యూటీ ఎస్ఈ సునీల్‌నాయక్, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

సీట్ల కోసం ఆఫీసుల వద్దకు రావద్దు..

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్19 : అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి అన్ని తరగతుల సీట్లు భర్తీ అయ్యాయనీ... వాటి కోసం ఎవరూ ఆఫీసుల చుట్టూ తిరగొద్దని గురుకులాల ఉమ్మడి అనంత జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ బుధవారం ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో 6 నుంచి 10 తరగతులు, ఇంటర్మీడియట్‌కు సంబంధించి పరీక్షలు, కౌన్సెలింగ్, మెరిట్ ప్రకారం సీట్లు భర్తీ చేశామన్నారు. అయితే కొంత మంది విద్యార్థులు, తల్లిదండ్రులను డీసీఓ కార్యాలయానికి వెళ్లాలని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. వారి మాటలు నమ్మవద్దన్నారు. ఎంపిక చేసిన విద్యార్థుల్లో ఎవరైనా జాయిన్ కాకపోతే... ఆ సీటు మెరిట్ ప్రకారం భర్తీ చేస్తామన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలన్నారు.

రైల్వే భద్రతపై ప్రత్యేక దృష్టి : డీఆర్ఎం

రాయదుర్గం, జూన్ 19: రైల్వే ప్రమాదాలను నియంత్రించేందుకు భద్రతపై ప్రత్యేక దృష్టి తీసుకుంటున్నట్లు హుబ్లీ డివిజన్ డీఆర్ఎం హర్షకరే తెలిపారు. బుధవారం ఆయన రాయదుర్గం రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేశారు. తెల్లవారుజామున ప్రత్యేక రైలులో వచ్చి నాలుగు గంటల పాటు తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా సిగ్నలింగ్, రైలు పట్టాల భద్రత తదితర అంశాలను పూర్తిగా పరిశీలించారు. ఇటీవల జరుగుతున్న రైలు ప్రమాదాల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భద్రతకు సంబంధించి పలు విషయాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. రైల్వే సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అదే విధంగా సిగ్నలింగ్ వ్యవస్థ గురించి పూర్తిగా అడిగి తెలుసుకున్నారు. లోపాలు, చేపట్టవలసిన మరమ్మత్తులు, సమస్యల గురించి తెలుసుకున్నారు. కొత్తగా నిర్మించిన రైల్వే స్టేషన్ భవనాన్ని పరిశీలించారు.

నూతన రైల్వేస్టేషన్‌ను వెంటనే ప్రారంభించాలి

రాయదుర్గం రూరల్: రాయదుర్గంలో నూతన రైల్వేస్టేషన్‌ను వెంటనే ప్రారంభించాలని రైల్వేడివిజనల్ సలహా మండలి మాజీ సభ్యుడు గుడేకోట శివకుమార్, రైల్వేయాక్షన్ కమిటీ సభ్యులు జయంతి సురేష్ కోరారు. నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ రైల్వే మేనేజర్ హర్షకరే రాయదుర్గం స్టేషన్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్తరైల్వేస్టేషన్‌ను వెంటనే ప్రారంభించాలని అందులో మౌలిక వసతులు కల్పించి, స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కదిరిదేవరపల్లి, గుంతకల్లు ప్యాసింజర్ రైలును పునః ప్రారంభించాలన్నారు. రాయదుర్గం నుంచి బళ్లారి మధ్యలో నడపాలని కోరారు. రైల్వేమేనేజర్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


రాయదుర్గం రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న డీఆర్ఎం హర్షకరె

ప్రతి మహిళ.. సాధికారత సాధించాలి



మాట్లాడుతున్న విశాలా ఫెర్రర్

బత్తలపల్లి, జూన్ 19: ప్రతి మహిళా సాధికారత సాధించాలని ఆర్డీటీ మహిళా విభాగ డైరెక్టర్ విశాలా ఫెర్రర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో ఉమెన్ కోఆపరేటివ్ సొసైటీని బుధవారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. మహిళలందరూ సొసైటీని ఏర్పాటు చేసి అందులో కొంత పెట్టుబడి పెట్టి అవసరమైన వారు రణాలు తీసుకుని తిరిగి కట్టడం వల్ల వడ్డీల రూపంలో ఆదాయం వారికే వస్తుందన్నారు. మహిళలు ఇతరులపై ఆధారపడకుండా, పట్టుదలతో ముందుకు సాగితే ఏదైనా సాధించవచ్చన్నారు. సమాజంలో ప్రతి మహిళా గౌరవంతో జీవించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీ ప్రమీల కూమారి, ఆర్డీటీ సిబ్బంది సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పరిశీలిస్తున్న విదేశీయులు

బత్తలపల్లి, జూన్ 19: మండలంలోని రాఘవంపల్లిలో సేంద్రియ వ్యవసాయాన్ని జాంబియా దేశస్థులు బుధవారం పరిశీలించారు. డీపీఎం లక్ష్మనాయక్ విదేశీ బృందానికి సేంద్రియ వ్యవసాయంలో రైతులు పాటించే పద్ధతులు వివరించారు. రైతులు పొలాలకు వినియోగించే జీవామృతం, గణ జీవామృతం, బీజామృతం తయారు చేసే విధానం, వాటిని వాడే విధానాన్ని వివరించారు. క్రిమిసంహారక మందులతో పంటలు పండించడం వల్ల రైతుకు పెట్టుబడులు అధికం అవుతాయన్నారు. సేంద్రియ వ్యవసాయం చేసే రైతులకు పెట్టుబడులు తగ్గి అధిక లాభాలు వస్తాయని వివరించారు.

పొంచివున్న ప్రమాదం..!



జియో టవర్‌కు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

నంబులపూలకుంట, జూన్ 19: మండలంలోని వెలిచెలమల క్రాస్‌లో నివాస గృహాల మధ్య జియో టవర్‌కు ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారిందని కాలనీ వాసులు భాస్కర్, రాజగోపాల్, జనార్ధన్, లక్ష్మీదేవి, నాగరాజు అన్నారు. టవర్‌కు 25 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. నివాస గృహాలకు ఈ డీపీద్వారానే విద్యుత్ సరఫరా అవుతోంది. పది రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్‌నుంచి ఏర్పాటు చేరసిన ఎర్తు వైర్ నుంచి పొగ వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పదిరోజుల క్రితం డీపీపై చెట్టుకొమ్మ విరిగిపడిందన్నారు. అప్పటినుంచి పొగ వస్తోందన్నారు. పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని మండిపడ్డారు. డివిజన్ స్థాయి అధికారులకు తెలిపినా, సమస్య పరిష్కరించలేదన్నారు. అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే అరికట్టాలని కోరారు.

ఫాదర్ ఫెర్రర్‌కు ఘన నివాళి



ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న టీడీపీ నాయకులు

నల్లమాడ, జూన్ 19: ఫాదర్ ఫెర్రర్ వర్ధంతిని టీడీపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. బీసీ హాస్టల్ వద్ద ఉన్న ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పలువురు మాట్లాడుతూ ఫాదర్ ఫెర్రర్ ఆర్డీటీ సంస్థను స్థాపించి విద్య, వైద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. పేదలకు ఇళ్లు, తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఉన్నతచదువులు, రైతులకు తోటల పెంపకం, గ్రామాల్లో ఆర్డీటీ పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలతో పేదలపాలిటి పెన్నిధి అయ్యారని కొనియాడారు. బుట్టి నాగభూషణనాయుడు, టెంట్ కేశవరెడ్డి, శ్రీనివాసులు, సీబీ మంజునాథ్‌రెడ్డి, హనుమంతురెడ్డి, పల్లపు ప్రతాప్, మహేంద్ర నాయక్, రవికుమార్, గోజేనాయక్ పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి



టీడీపీ పట్టణ అధ్యక్షుడిని సన్మానిస్తున్న రజకసంఘం నాయకులు

ధర్మవరం, జూన్ 19: రజకుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్‌లను కోరారు. బుధవారం వారిని రజకులు శాలువ కప్పి సన్మానించారు. దోబీఘాట్, కమ్యూనిటీ హాల్ ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. రజకసంఘం పార్లమెంట్ కన్వీనర్ మాల్యవంతం నారాయణస్వామి, నాయకులు బద్దలాపురం నరసింహులు, రామాంజనేయులు, ముత్యాలప్ప, మూర్తి పాల్గొన్నారు.

జనసేన నాయకుల ప్రత్యేక పూజలు



ఖాద్రీశుడికి టెంకాయలు సమర్పిస్తున్న జనసేన నాయకులు

కదిరిఅర్బన్, జూన్ 19: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆ పార్టీ నాయకులు పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, 101 టెంకాయలు సమర్పించారు. పవన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకుండా టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఉమ్మడిగా పోటీ చేసి 164 స్థానాల్లో గెలిచిందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రిగా పవన్‌కళ్యాణ్ బాధ్యతలు చేపట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. కుటాల లక్ష్మణ్, రాజేంద్రప్రసాద్, ఆంజిబాబు, ప్రసాద్, లోకేష్, నందిశెట్టిబాబు, అక్బర్, రాజా పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలుస్తాం: ఎమ్మెల్యే



సబ్సిడీ విత్తన కాయలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి

ఓబుళదేవరచెరువు, జూన్ 19: కరువు రైతులకు అండగా నిలుస్తానని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనకాయలు బుధవారం మండలంలోని తంగేడుకుంట గ్రామంలో శోత్రియం రైతులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనకాయలు అందిస్తామన్నారు. తంగేడుకుంట శోత్రియం భూముల రైతులందరికీ పట్టాలు ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. రైతు సంక్షేమమే టీడీపీ ధ్యేయమన్నారు. ప్రతిరైతు సకాలంలో పంటలు సాగు చేసి, అధిక దిగుబడి సాధించాలని కోరారు. రైతులు బాగుంటేనే రాజ్యం బాగుటుందన్న నానుడి నిజమన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టీడీపీ మినీ మేనిఫెస్టోలో రైతులను ఆదుకోవడానికి పంట పెట్టుబడిసాయంగా ప్రతి ఏటా రూ. 20వేలు అందించే విధంగా పథకాన్ని తీసుకువచ్చారన్నారు. దాన్నిఅమలు చేసేలా త్వరలో కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, న్యాయవాది రాజశేఖర్, తహసీల్దార్ ఖాజాబీ, ఏఓ ఇలియాజ్ అహమ్మద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ అగిశం రంగనాథ్, ఎంపీపీ తుమ్మల పర్వీన్‌షామీర్, సర్పంచ్ పఠాన్ హమీదారఫీక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అడుగడుగునా హారతులు: నియోజకవర్గంలో మొదటిసారి అధికారికంగా విత్తన పంపిణీకి తంగేడుకుంటకు హాజరైన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డికి అడుగడుగునా ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు, వృద్ధులు ఆప్యాయంగా పలకరిస్తూ, వారికి హారతులిచ్చారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నాయకులు ఉట్ల మహేశ్వర్‌రెడ్డి, జౌలిబాబా ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి ఘనస్వాగతం పలికారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ: మండలంలోని చౌడంపల్లికి చెందిన ఇరగొట్టు వెంకటేష్ కుమార్తె ప్రమీల ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి బుధవారం గ్రామానికెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమీల మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అలాగే ఇటీవల మృతిచెందిన బలిపల్లి గ్రామానికి చెందిన అక్కులప్ప, తంగేడుకుంట గ్రామానికి చెందిన తలారి సుధాకర్ కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందించారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

బేల్దారి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సల్మాన్‌ఖాన్

ధర్మవరం, జూన్ 19: కుటుంబ సమస్యలతో ఓ బేల్దారి ఆత్మహత్య కు యత్నించిన సంఘటన బుధవారం పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులుతెలిపిన మేరకు ఇందిరమ్మ కాలనీకి చెందిన సల్మాన్‌ఖాన్ బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సల్మాన్‌ఖాన్ తన భార్య అబియాతో తరచూ గొడవపడేవారు. తీవ్ర మనస్థాపానికి లోనైన సల్మాన్‌ఖాన్ ఇంటిలోనే విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు అతనిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భర్తపై భార్య, కుటుంబ సభ్యుల దాడి

ధర్మవరం, జూన్ 19: పట్టణంలోని శివానగర్‌కు చెందిన రవివర్ధన్‌పై ఆయన భార్య ధనలక్ష్మి, అత్త లక్ష్మీదేవి, మరదలు రూప దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు రవివర్ధన్ ప్రైవేటు వాహనానికి డ్రైవర్‌కు వెళ్తున్నాడు. ఈయనకు హిందూపురం పట్టణానికి చెందిన ధనలక్ష్మితో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరి కాపురం కొన్నేళ్లు సాఫీగానే సాగింది. ఈ మధ్య తరచూ భార్యాభర్తలు గొడవ పడేవారు. దీంతో రవివర్ధన్ ధర్మవరం కోర్టులో బుధవారం విడాకులకు దరఖాస్తు చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న భార్య, అత్త, మరదలు హిందూపురం నుంచి నేరుగా రవివర్ధన్ ఇంటికి వచ్చి గొడవకు దిగారు. ఈ గొడవ కాస్త పెద్దదై భర్తపై వారు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన భర్త కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. రవివర్ధన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రైతులు పేర్లు నమోదు చేసుకోండి

ధర్మవరంరూరల్, జూన్ 19: రైతులు కందివిత్తనాల కోసం ఆయా ఆర్‌బీకేలలో పేర్లు నమోదు చేసుకోవాలని మండల ఏఓ ముస్తఫా కోరారు. బుధవారం వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో వేరుశనగ సాగుకోసం ఇంతవరకు 4139 మంది రైతులకు 3800 క్వింటాళ్లు పంపిణీ చేశామన్నారు. కందిసాగుచేసే రైతుల కోసం ఆర్‌బీకేలలో పేర్లు నమోదు చేసుకుంటే సరఫరా చేస్తామన్నారు. ఎకరాకు నాలుగుకేజీల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని సబ్సిడీ ధర పోను రూ.392 చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏఈఓగా వెంకటేష్

ఓబుళదేవరచెరువు, జూన్ 19: మండల వ్యవసాయ విస్తర్ణాధికారిగా వెంకటేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. తనకల్లులో ఏఈఓగా పనిచేస్తూ బదిలీపై మండలానికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ సాగు, అధిక దిగుబడుగలపై సూచనలు, సలహాలిచ్చి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

వెలగని వీధిదీపాలు.. అంధకారంలో గ్రామాలు



గాండ్లపెంటలో వెలగని వీధిదీపం

గాండ్లపెంట, జూన్ 19: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ వీధి దీపాలు వెలగక అంధకారంలో మగ్గుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. గత ఐదేళ్ల పాలనలో పంచాయతీ శాఖకు నిధులు కరువు కావడంతో 14 పంచాయతీలోని సర్పంచ్‌లు వీధిదీపాల మరమ్మత్తులు, నూతనవి అమర్చడానికి ముందుకు రాలేదు. వైసీపీ పాలనలో పంచాయతీల నిధులన్ని కరెంటు బకాయిలకువాడుకోవడంతో అభివృద్ధి ముందుకు సాగలేదని ప్రజలంటున్నారు. కనీసం వీధి దీపాలు వెసిన పాపాన పోలేదంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాకారణంగా పచ్చదనం చోటుచేసుకుంది. దీంతో విషపురుగులకుఆవాసంగా మారాయి. వీధి దీపాలు లేకపోవడంతో విషపురుగుల సంచారించే అవకాశాలున్నాయంటున్నారు. గాండ్లపెంట మండలకేంద్రంలో వీధి దీపాలు వెలగడంలేదు. కొని తనుకు తనుకుమంటున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులుస్పందించి వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

ధర్మవరంరూరల్, జూన్ 19: ఏఎఫ్ ఎకాలజీ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి, పలురంగాల్లో నైపుణ్యశిక్షణ ఇస్తున్నట్లు సంస్థ మండల టీం లీడర్ దస్తగిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ డైరెక్టర్ మల్లారెడ్డి సహకారంతో గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతీ, యువకుల కోసం కంప్యూటర్ స్కిల్స్, టూవీలర్ మెకానిజం, ఎలక్ట్రికల్, ఎల్ఎంవీ, హెచ్ఎంవీ డ్రైవింగ్, సెల్‌ఫోన్ రిపేరీ తదితర వాటిపై నైపుణ్యశిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి అయిన తర్వాత సర్టిఫికెటు అందిస్తామన్నారు. ఈనెల 20న టూవీలర్ మెకానిజం బ్యాచ్ ప్రారంభమవుతుందని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు అనంతపురం ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సంస్థ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి



విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

ముదిగుబ్బ, జూన్ 19: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు చంద్రకళ, గిరిధర్ అన్నారు. బుధవారం గలగుబ్బల ప్రాథమిక పాఠశాలలో వారు 45 మంది విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పలకలు, పెన్నులు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఉపాధ్యాయులు అనురాధ, ప్రసాద్, రాజేశ్వరి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు మొదలయ్యేనా?

- అర్ధంతరంగా ఆగిన ప్రభుత్వ భవనాలు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



ఏకపాదంపల్లిలో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ కేంద్రం

తాడిమర్రి, జూన్ 19: మండలంలో ఆరేళ్లుగా నిలిచిన అభివృద్ధి పనులు కూటమి ప్రభుత్వంలోనైనా మొదలవుతాయా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. పలు ప్రభుత్వ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. 2019లో టీడీపీ ప్రభుత్వ హయాంలో సగం వరకు పనులు జరిగిన ఆ తరువాత వైసీపీ ప్రభుత్వ హయాంలో వాటి పనులు పూర్తి చేయలేకపోయింది. మండలంలోని ఏకపాదంపల్లి గ్రామంలో రూ.6.50 లక్షల వ్యయంతో అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని ప్రారంభించి 70 శాతం పనులు పూర్తయ్యాయి. 2019 ఎన్నికలకు ముందు నిలబడిన పనులు ఆ తరువాత మొదలు కాలేదు. దీంతో భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. కనీసం ఐసీడీఎస్ అధికారులు కూడా పట్టించుకోలేదు. అలాగే రూ.48లక్షల వ్యయంతో చేపట్టిన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం 90శాతం పనులు పూర్తయినా వైసీపీ ప్రభుత్వంలో ఒక్క ఇంచ్ కూడా పనులు సాగలేదు. అధికారులు స్పందించి భవనాలను వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

డిప్యూటీ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పుట్టపర్తి రూరల్,జూన్ 19: రాష్ట్రంలో కూటమి విజయంలో కీలకభూమిక పోషించిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటానికి కూటమి నాయకులు, కార్యకర్తలు పట్టణంలో క్షీరాభిషేకం చేశారు. బుధవారం అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో డిప్యూటీ సీఎంగా పవన్‌కళ్యాణ్ పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా స్థానిక హనుమాన్‌కూడలిలో సంబరాలు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని, కూటమి ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు రామాంజనేయులు, బాలగంగాధర్, గంగిశెట్టి, దాసరి శంకర్, చింతాదామోదర్, దాసరి నాగభూషణం, శ్రీనివాసులు, పాపారెడ్డి, ఉక్కలం శ్రీనివాసులు, రాము, మారుతి, కూర్మనాయుడు పాల్గొన్నారు.

పవన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

తనకల్లు, జూన్ 19: ఏపీ ఉప ముఖ్యమంత్రిగా బుధవారం జనసేన పార్టీఅధినేత పవన్‌కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో మండలంలోని కొక్కంటి క్రాస్ వద్ద పవన్‌కళ్యాణ్ చిత్రపటాన్ని ఉంచి కేక్ కట్ చేసి, క్షీరాభిషేకం చేశారు. జనసేన నాయకుడు కె.వి. రమణ మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి విజయం సాధించి అధికారం చేపట్టడం హర్షించతగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ నాయకుడు సోంపాళ్యం నాగభూషణం, జనసేన కొట్టి అశ్వత్థకుమార్, ఎంపీటీసీ అమర్ కార్తికేయ, మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

సినీమా ఆర్టు డైరెక్టర్ సాహీ సురేష్ హర్షం : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పవన్‌కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేయడంపై సినిమా ఆర్ట్ డైరెక్టర్ సాహీ సురేష్ హర్షం వ్యక్తం తన వ్యవసాయ పొలం వద్ద పోస్టర్ అతికించారు.

బుక్కపట్నం: ఉపముఖ్యమంత్రిగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ బుధవారం బాధ్య తలు స్వీకరించారు. ఈసందర్భంగా మండలకేంద్రంలోని తేరుకూడలిలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కూటమి అధికారంలో రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఆకాంక్షించారు. నాయకులు దాసరి శ్రీనివాసులు, జంగం వెంకటరాముడు, సంజీవరాయుడు, ఈశ్వరప్ప, సతీష్‌రాయల్, ఆకుల చంద్ర, మన్సూర్, గాజుల బాలాజీ పాల్గొన్నారు.



బుక్కపట్నంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



తనకల్లులో కేరింతలు కొడుతున్న జనసేన నాయకులు



పుట్టపర్తిలో పవన్‌కల్యాణ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఉత్తమ విద్యనందించాలి: కందికుంట



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జూన్ 19: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్య అందించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యునిఫాం, నోటు పుస్తకాలు అందిస్తోందన్నారు. ఉపాధ్యాయులు ఉత్తమ బోధన అందించి విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చాలన్నారు. వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు లియాక్, టీడీపీ నాయకులు డైమండ్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

'నేను బడికి పోతా'పై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తనకల్లు, జూన్ 19: విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం నేను బడికిపోతా కార్యక్రమంపై మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. విద్యాశాఖ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు, అంబేడ్కర్ సర్కిల్, స్టేట్‌బ్యాంక్ వీధి, బుడిదగడ్డ వీధి, ఇందిరానగర్ మీదుగా అంబ్కేర్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటుచేశారు ఎంఈఓ-2 కళ్యాణి మాట్లాడుతూ గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలలో చేర్పించాలని సూచించారు. విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు, బూట్లు, బ్యాగులు, మధ్యాహ్నం భోజనం ప్రభుత్వం అందిస్తోందన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను బడికి పంపాడానికి కృషి చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయండి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

నల్లమాడ, జూన్ 19: మా పొలాల్లోకి వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయాలని మండలంలోని కుటాలపల్లి గ్రామ రైతులు డిప్యూటీ తహసీల్దార్ దేవేంద్ర నాయక్‌కు విన్నవించారు. బుధవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవేలైన్ వెళుతుండటంతో తమ పొలాల్లోకి వెళ్లేందుకు దారి లేదన్నారు. ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పొలాలకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయాలన్నారు. డీటీ స్పందిస్తూ మీ సమస్యను ఉన్నతాధికారులకు వివరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బుట్టి నాగభూషణనాయుడు, మారాల చెన్నారెడ్డి, రైతులు రాజారెడ్డి, మహేంద్రనాయక్, మాధవరెడ్డి, దామోదర్‌రెడ్డి, గంగరాజు, చంద్రానాయక్, సేవేనాయక్, పుల్లారెడ్డి, కేశవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శంకర్‌రెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ మినిస్టీరియల్ టీంకు ఘనస్వాగతం



టీంలీడర్ రితేష్‌చౌహాన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి రూరల్, జూన్ 19: సత్యసాయి బాబా మహాసమాధి దర్శనార్థం ప్రశాంతినిలయానికి విచ్చేసిన ఇంటర్ మినిస్టీరియల్ టీం లీడర్ రితేష్ చౌహాన్‌కు కలెక్టరు అరుణ్‌బాబు ఘనస్వాగతం పలికారు. ఈమేరకు బుధవారం జిల్లాలో రబీ కరవు పరిస్థితిని అంచనావేయడంలో భాగంగా రొద్దం మండలం ఆర్.కొట్టాలలో పప్పుశనగ రైతులతో కరువు పరిస్థితులపై ముఖాముఖి సమావేశం నిర్వహించారు. అనంతరం సత్యసాయిబాబా మహాసమాధి దర్శనానికి టీంలీడర్ రితేష్‌చౌహాన్‌ను ప్రశాంతినిలమం శాంతిభవన్ వద్ద కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందచేశారు. అనంతరం ఆయన మహాసమాధిని దర్శించుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

- తండ్రి ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి..

ధర్మవరంరూరల్, జూన్ 19: మండలంలోని బిల్వంపల్లి గ్రామానికి చెందిన ఓ దళిత యువతి 15వ తేదీ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. యువతి తండ్రి సుధాకర్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు... బుక్కపట్నం మండలం మారాల గ్రామానికి చెందిన సుధాకర్ కుమార్తె స్రవంతి(19) రెండునెలలుగా ధర్మవరం మండలంలోని బిల్వంపల్లి గ్రామంలో ఉంటోంది. ఆ యువతి బుక్కపట్నం మండలం చంద్రాయునిపల్లి కొట్టాల గ్రామానికి చెందిన యువకుడు రవిచంద్రతో ప్రేమాయాణం సాగించింది. తల్లిదండ్రులు మందలించడంతో ఆ యువతి బిల్వంపల్లిలోని అమ్మమ్మ మస్తానమ్మ ఇంట్లో నివాసం ఉండేది. యువతి బిల్వంపల్లిలో ఉండటంతో ఆ యువకుడు గ్రామానికి వచ్చిపోతుండేవాడన్నారు. ఉన్నఫళంగా 15వ తేదీన ఆ యువతి ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఆ విషయం అమ్మమ్మ తల్లిదండ్రులకు తెలపడంతో వారు వచ్చి మృతదేహాన్ని స్వగ్రామమైన మారాలకు తీసుకెళ్లి అంత్యక్రియులు నిర్వహించారు. స్రవంతి మృతిపై అనుమానం ఉన్నట్లు బుధవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశాడు. అనుమానస్పద కేసుగా నమోదు చేసి విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మారాల గ్రామంలో రెవెన్యూ అధికారుల సమక్షంలో యువతి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవం

హిందూపురం అర్బన్, జూన్ 19: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు వివేకానంద యోగా థెరపీ అధ్యక్షుడు బద్రీ నారాయణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పట్టణంలోని వీడీ రోడ్డులోని వాసవీధర్మశాలలో నిర్వహిస్తామన్నారు. యోగా సనాతన భారతీయ సంపద అని, రుషిపుంగవులు యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించారన్నారు. ప్రతి వ్యక్తి యోగా శిక్షణ పొంది ఆరోగ్యవంతులుగా జీవించాలన్నారు.

30న మెగా వైద్యశిబిరం

హిందూపురం అర్బన్, జూన్ 19: జిల్లా ఆర్యవైశ్య సంఘం, హిందూపురం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హిందూపురం ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక వాసవీ ధర్మశాలలో బెంగళూరుకు చెందిన ఓ ఆసుపత్రి సహకారంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, కార్డియాక్ సర్జన్ తదితర వైద్య నిపుణులు హాజరవుతారన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కోరారు. వివరాలకు 9440194111, 8019379755, 7013757752 9440579299 లను సంప్రదించాలన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గోరంట్ల, జూన్ 19: పట్టణంలోని మాధవరాయ ఆలయం వద్ద గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామాభ్యుదయ మహిళ మండలి అధ్యక్షురాలు రమాపావని రాయల్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు అన్నిరకాల రోగాలకు ఉచిత చికిత్సలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాగు పద్ధతులపై అవగాహన

అగళి, జూన్ 19: సాగు పద్ధతులపై ఏడీఏ సనావుల్లా బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని ఇరిగేపల్లిలో బుధవారం రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ... నానో యూరియా, డీఏపీ వాడకం, డ్రోన్ ద్వారా సస్యరక్షణ మందుల పిచికారి, పురుగుల మందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. వేరుశనగ, రాగి, మొక్కజొన్న, పత్తిపంటల్లో పాటించాల్సిన మేలైన సాగు పద్ధతులు తెలియజేశారు. వేరుశనగ పంటలకు ప్రత్యామ్నాయంగా ఆముదం, కంది వంటి పంటలను పండించాలని వివరించారు. ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలేని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శేఖర్‌నాయక్, ఏఈఓ దాక్షాయిణి, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త..!

గుడిబండ, జూన్ 19 : గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్ఎన్ సుధారాణి, హెల్త్ అసిస్టెంట్ రవికుమార్, ఎల్‌టీ జనార్దన్ పేర్కొన్నారు. వారు బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామాల్లో ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలంలో కాలనీలో మురుగునీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మహిళలు, బాలింతలు రక్తహీనతపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయండి: ఎంఈఓ

రొళ్ల, జూన్ 19: పాఠశాలకు సంబంధించిన అన్ని విషయాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఎంఈఓ శ్రీధర్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. రొళ్ల ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో యూడైస్ ప్లస్ అప్డేట్ కార్యక్రమం అత్యంత త్వరగా పూర్తి చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. స్టూడెంట్ కిట్లను, పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందించాలని సూచించారు.

శిలాఫలకం ధ్వంసం... కేసు నమోదు

యల్లనూరు, జూన్ 19: మండలంలోని గొడ్డుమర్రి గ్రామంలో విలేజ్‌క్లినిక్ వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి పగలగొట్టడంతో కేసు నమోదుచేశామని సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. రాత్రి 8గంటల ప్రాంతంలో ఈ సంఘటన జరిగినట్లు వివరించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీస్ పికెట్ ఏర్పాటు

గ్రామంలో నెలకొన్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని భద్రతా చర్యల్లో భాగంగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఆరేళ్ల బాలికపై అత్యాచారయత్నం

కళ్యాణదుర్గం, జూన్ 19: మండల పరిధిలోని ఓ గ్రామంలో ఆరేళ్ల చిన్నారిపై 16 యేళ్ల బాలుడు అత్యాచారానికి యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం రాత్రి కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి బాలికను తీసుకురావడంతో వెలుగుచూసింది. సోమవారం ఇంటి వద్ద ఆడుకుంటున్న సమయంలో బాలికకు పండు ఇస్తానని చెప్పిన బాలుడు గదిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించాడు. విషయం ఎవరికైనా చెబితే కొడతానని ఏడుస్తున్న బాలికను బెదిరించాడు. బాలికను తల్లి అడగటంతో విషయం చెప్పింది. ఆమె భర్తతో కలిసి వెళ్లి బాలుడిని నిలదీసింది. బాలికను మంగళవారం రాత్రి కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడి నుంచి ఇతర పరీక్షల నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మంగళవారం రాత్రే హుటాహుటిన డీఎస్పీ శ్రీనివాసులు ఆస్పత్రికు వెళ్లి జరిగిన సంఘటనపై బాలిక తల్లిదండ్రులతో వివరాలు ఆరా తీశారు. పూర్తి వివరాలు వైద్య పరీక్షల అనంతరం తెలుపుతామని పోలీసులు తెలిపారు.

లైంగిక వేధింపులపై కేసు

గుంతకల్లుటౌన్, జూన్ 19: మండలంలోని ఓ గ్రామానికి చెందిన సూర్యనారాయణపై ఎస్సీ, ఎస్టీ, లైంగిక వేధింపుల కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సురేష్ బుధవారం తెలిపారు. సూర్యనారాయణ ఓ మహిళను గత కొన్ని రోజులుగా లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి ఆ మహిళ ఇంట్లోకి చొరబడి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాధిత మహిళ, ఆమె భర్త బుధవారం రూరల్‌పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ, లైంగిక వేధింపులు, ఇంట్లోకి చొరబడిన కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

రోడ్లు జలమయం

- పురంలో మూడు రోజులుగా వర్షం
- ఖాళీ స్థలాలు, గుంతల్లో నిలిచిన నీరు
- ఇబ్బంది పడుతున్న పట్టణ ప్రజలు


టీచర్స్ కాలనీలో చెరువును తలపిస్తున్న దృశ్యం


బురదమయమైన రాజరాజేశ్వరి కాలనీ

హిందూపురం అర్బన్, జూన్ 19: మూడు రోజులుగా హిందూపురం పట్టణం, పరిసర ప్రాంతాల్లో భారీగా వర్షం పడుతోంది. దీంతో ఎక్కడ చూసినా రోడ్లపై నీరు నిలిచింది. గత ఐదేళ్లగా అభివృద్ధి పనులు జరుగకపోవడంతో పురంలో రోడ్లన్నీ పూర్తి అధ్వానంగా మారాయి. గుంతల్లో వర్షపునీరు నిలబడడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు ప్రమాదాలకు గురవుతున్నారు. నంది సర్కిల్ నుంచి ఎస్‌బీఐ, ఎన్టీఆర్ సర్కిళ్ల వరకు రోడ్డు మొత్తం గుంతల మయం. నిత్యం వందలాది మంది ఈ రోడ్డులో ప్రయాణిస్తుంటారు. జిల్లాస్థాయి అధికారులు కూడా వెళ్తుంటారు. అయినా ఏ అధికారికి ఈ రోడ్డు దుస్థితి కనపడలేదా అని ప్రజలు నిలదీస్తున్నారు. ఇదిలా ఉండగా పట్టణ పరిధిలోని డీఆర్ కాలనీ, టీచర్స్ కాలనీ, విద్యానగర్, కెంచా కల్యాణ మండపం తదితర చోట్ల రోడ్లపై నీరు నిలిచిపోయి చెరువులను తలపిస్తున్నాయి. కనీసం కాలనడకన వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి రోడ్లు బురదమయమయ్యాయి. అ డుగు తీసి అడుగు వేయలేని విధంగా మారాయి. ఆ కాలనీల్లో పెద్ద పెద్ద భవంతులు వెలసినా, ఐదేళ్లగా రోడ్ల అభివృద్ధి చేపట్టలే దంటే వైసీపీ పాలన ఎంత బాధ్య తా రాహిత్యంగా సాగిందో చెప్పవచ్చని టీచర్స్ కాలనీ, డీఆర్ కాలనీ, కెంచా కళ్యాణమండపం ప్రాంతాల వాసులు ఆగ్రహిస్తున్నారు. తాము కూడా అందరి మాదిరే అన్ని ట్యాక్సులు కడుతున్నా తమ ప్రాంతంలో డ్రైన్లు, వీధిలైట్లు, రోడ్లు ఎందుకు వేయలేదని ప్రశ్నిస్తున్నారు. టీచర్స్ కాలనీ 14వ వార్డుకు ఏకంగా మునిసపల్ వైస్ చైర్మన్ ప్రాతినిధం వహిస్తున్నారు.

వర్షం వస్తే అంబులెన్స్ కూడా రాలేదు



వర్షాకాలం వచ్చిందంటే నరకం కనబడుతుంది. పరిసర ప్రాంతాలు బురదమయమై ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి సమయాల్లో అత్యవసర సమయాల్లో అంబులెన్స్ రాలేని పరిస్థితి నెలకొంది.

-కాలవ ఇందిర, హౌసింగ్ బోర్డు కాలనీ

వర్షాకాలం అంటేనే భయం



వర్షా కాలం వచ్చిందంటే భయమేస్తుంది. అడుగు భయట పెట్టలేనిపరిస్థితి నెలకొంటుంది. ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. మా కాలనీల్లో డ్రైన్లు, రోడ్లు ఎందుకు వేయరో అర్థం కావడంలేదు..

- నాగరాజు, హౌసింగ్‌బోర్డు కాలనీ

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వాసుదేవన్

పెనుకొండ టౌన్, జూన్ 19 : పట్టణంలోని కోర్టు ఆవరణంలో ఈనెల 29న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వాసుదేవన్ తెలిపారు. ఆయన బుధవారం కోర్టు ఆవరణంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ... జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రతి ఒక్క కక్షిదారుడు సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. లోక్‌అదాలత్‌లో పలు రకాల కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. న్యాయవాదులు కూడా తమ విధిగా ఎక్కువ కేసులు రాజీచేసేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయాధికారులు ముజీబ్ పసపల సయ్యద్ , బుజ్జప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడామైదానం కోసం స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న టీడీపీ నాయకులు

రొళ్ల, జూన్ 19: మండలంలోని కస్తూర్బా బాలికా విద్యాలయానికి క్రీడా మైదానం కోసం టీడీపీ నాయకులు స్థల పరిశీలన చేశారు. పాఠశాల సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని వారు పరిశీలించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దృష్టికి తీసుకెళ్లి త్వరలో పాఠశాలకు ఆ స్థలాన్ని అప్పగించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దాసిరెడ్డి, టీఎస్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, నాగరాజు, రాజ్‌కుమార్, భరత్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అరటి మొక్కలను తొలగించిన దుండగులు

- పోలీసులకు ఫిర్యాదు


అరటిమొక్కలను పరిశీలిస్తున్న పోలీసులు

యాడికి, జూన్ 19: పెద్దపేట గ్రామానికి చెందిన లక్ష్మీదేవి అరటితోటలో 70అరటి మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. పెద్దపేట గ్రామానికి చెందిన లక్ష్మీదేవి తన వ్యవసాయ తోటలో అరటి సాగు చేసింది. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 70అరటిమొక్కలను భూమిలో నుంచి తొలగించి అక్కడే పడేశారు. బుధవారం ఉదయం తోటవద్దకు వెళ్లిన లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు వాటిని గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తోటవద్దకు వెళ్లి మొక్కలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. లక్ష్మీదేవి వైసీపీలో ఉన్నారు. సమాచారం అందుకున్న మాజీ జడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి తొలగించిన అరటిమొక్కలను పరిశీలించారు. రైతులతోటల్లో అరటి మొక్కలను తొలగించడం దుర్మార్గపు చర్య అని, నిందితులను గుర్తించి పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాని కోరారు.

కరువు బృందం సభ్యుడికి స్వాగతం



రితేష్‌చౌహాన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి రూరల్, జూన్ 19: సత్యసాయిబాబా మహాసమాధి దర్శనార్థం ప్రశాంతి నిలయానికి విచ్చేసిన కేంద్ర కరువు బృందం సభ్యుడు రితేష్ చౌహాన్‌కు కలెక్టరు అరుణ్‌బాబు ఘనస్వాగతం పలికారు. ఈమేరకు బుధవారం జిల్లాలో రబీ కరవు పరిస్థితిని అంచనావేయడంలో భాగంగా రొద్దం మండలం ఆర్.కొట్టాలలో పప్పుశనగ రైతులతో కరువు పరిస్థితులపై ముఖాముఖి సమావేశం నిర్వహించారు. అనంతరం సత్యసాయిబాబా మహాసమాధి దర్శనానికి వచ్చిన రితేష్‌చౌహాన్‌ను ప్రశాంతినిలమం శాంతిభవన్ వద్ద కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందచేశారు. అనంతరం ఆయన మహాసమాధిని దర్శించుకున్నారు.

మడకశిరలో భారీ వర్షం


చెక్‌పోస్టు రోడ్డుపై నిలిచిన నీరు

మడకశిర/టౌన్: మడకశిర నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల రోడ్లు బురదమయం అయ్యాయి. పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. రోడ్లలోని గుంతల్లో నీరు నిలబడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడం, వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొలం పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. వేరుశనగ సాగు చేసేందుకు పొలాలను దుక్కులు చేసి సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 1700 హెక్టార్లలో వేరుశనగ సాగు చేశారు. మిగతా రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. కురుస్తున్న వర్షాలక పలు కుంటలు, చెక్‌డ్యాంలలో నీరు చేరింది. అలాగే మడకశిర పట్టణంలో రోడ్లపైనే వర్షపు నీరు నిలిచి. పట్టణంలోని యాదవ కల్యాణమండపం నుంచి చెక్‌పోస్టు వైపు వెళ్లే రహదారిలో వర్షపునీరు నిలవడం తో కళాశాల, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారు లు వెంటనే వర్షపునీటిని మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హామీల అమలు వైపు అడుగులు


ట్రాన్స్‌ఫార్మర్ మార్చేందుకు స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

మడకశిరటౌన్, జూన్ 19: తెలుగు దేశం పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు వైపు అడుగులు వేస్తోంది. ఎన్నికలు పూర్తి అయిన వారం నుంచే హామీల అమలుకు ప్రణాళికలు రూపొందించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పట్టణంలోని రాజీవ్‌గాంధీ సర్కిల్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని విద్యుత్ శాఖ అధికారులకు మంగళవారం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో బుధవారం ట్రాన్స్‌ఫార్మర్ మార్పు కోసం అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మడకశిరలో పర్యటించినప్పుడు పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన రాలేదు. దీంతో మరోసారి ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చేందుకు పనులు ప్రారంభించారు. అలాగే వార్డులలో తాగునీటి సమస్య పరిష్కరించాలని పంచాయతీ అధికారులను వారు ఆదేశించడంతో... వెంటనే అధికారులు తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలపై ఆరా తీశారు. టీడీపీ అధికారంలోకి రాగానే హామీల అమలుకు అడుగులు వేస్తుండడంతో పట్టణ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

● తండ్రి ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి..

ధర్మవరంరూరల్, జూన్ 19: మండలంలోని బిల్వంపల్లి గ్రామానికి చెందిన ఓ దళిత యువతి 15వ తేదీ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. యువతి తండ్రి సుధాకర్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు... బుక్కపట్నం మండలం మారాల గ్రామానికి చెందిన సుధాకర్ కుమార్తె స్రవంతి(19) రెండునెలలుగా ధర్మవరం మండలంలోని బిల్వంపల్లిలో ఉంటోంది. ఆ యువతి బుక్కపట్నం మండలం చంద్రాయునిపల్లి కొట్టాల గ్రామానికి చెందిన యువకుడు రవిచంద్రతో ప్రేమాయాణం సాగించింది. తల్లిదండ్రులు మందలించడంతో ఆ యువతి బిల్వంపల్లిలోని అమ్మమ్మ మస్తానమ్మ ఇంట్లో నివాసం ఉండేది. యువతి బిల్వంపల్లిలో ఉండటంతో ఆ యువకుడు గ్రామానికి వచ్చిపోతుండేవాడన్నారు. ఉన్నఫలంగా 15వ తేదీ ఆ యువతి ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఆ విషయం అమ్మమ్మ తల్లిదండ్రులకు తెలపడంతో వారు వచ్చి మృతదేహాన్ని స్వగ్రామమైన మారాలకు తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. స్రవంతి మృతిపై అనుమానం ఉన్న ట్లు బుధవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసి విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మారాల గ్రామంలో రెవెన్యూ అధికారుల సమక్షంలో యువతి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

పొంచివున్న ప్రమాదం

చిలమత్తూరు, జూన్ 19: తాగునీటి బోరు మోటారుకు ఏర్పాటుచేసిన విద్యుత్ వైర్లను రోడ్డుపై నిర్లక్ష్యంగా పారేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం పొంచివుందోనని ప్రజలు ఆందోళన చెం దుతున్నారు. మండలంలోని కోట్లోపల్లికి తాగునీరు సరఫరా చేసేందుకు సమీపంలోని చెరువులో బోరు వేసి, మోటారు బిగించారు. ఈ బోరు పూర్తిగా రోడ్డుకు ఆనుకొని ఉంది. బోరు మోటారుకు పక్కనే ఉన్న విద్యుత్ లైను నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అయితే ఈ విద్యుత్ వైర్లు నిత్యం రద్దీగా ఉన్న రహదారిపై పడేశారు. విద్యుత్ సరఫరా అయ్యే కేబుల్ వైరు రోడ్డుపై ఉన్న నీటి గుంతల్లో పడి ఉంది. ఈ కేబుల్‌పైనే పెద్ద పెద్ద లగేజీతో ట్రాక్టర్లు, ఎద్దుల బళ్లు, ద్విచక్రవాహనాలు వెళుతుంటాయి. ఆ మార్గంలోనే ప్రజలు కాలినడకన, పొలాలకు వెళ్లే వారు మూగజీవాలతో వెళుతుంటారు. గొర్రెలు, మేకలు, బర్రెలు ఇలా వందలాది జీవాలు రోజూ నీటిపై తేలాడుతున్న ఈ విద్యుత్ కేబుల్‌ను తొక్కుకుంటూ వెళుతుంటాయి. తాగునీటి బోరు కావడంతో ఉద యం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా ఉంటుంది. దురదృష్టవశాత్తు ఈ కేబుల్‌కు ఎక్కడైనా రంధ్రం పడి, లోపల ఉన్న చిన్నరాగి తీగ బయటికి వచ్చి నా అక్కడున్న నీటికి విద్యుత్ సరఫరా జరుగుంది. దీంతో ఎవ్వరూ ఊహించని విధంగా ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది. రెండేళ్లగా రోడ్డుపై వేసిన విద్యుత్ వైర్లను మార్చాలని గ్రామస్థులు కోరినా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంతో ఉన్నా రని గ్రామస్థులు వాపోతున్నారు. సాధారణంగా వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ ప్రమాదం అందరికీ నిత్యం కనపడుతున్నా కేబుల్‌ను మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, ఇప్పటికైనా కళ్లెదుట కనపడుతున్న ప్రమాదకర పరిస్థితిని గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న తాగునీటి బోరు విద్యుత్ కేబుల్

ఘనంగా నాన్‌బా దర్గా గంధోత్సవం


నాన్‌బా సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న వంశీకులు, ముస్లిం మతపెద్దలు

పెనుకొండ, జూన్ 19 : పట్టణంలోని దర్గా పేటలో వెలసిన నాన్‌బా దర్గాలో స్వామివారి గంధం మహోత్సవాన్ని మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నాన్‌బా సాహెబ్ సహవర్దిని వంశీకుల ఆధ్వర్యంలో మతపెద్దలు, ఫకీర్లు వెంటరాగా గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకెళ్లి ప్రార్థనలు చేశారు. అంతకు ముందు భక్తులు చాదర్‌ను ఊరేగింపుగా తీసుకువెళ్లి నాన్‌బా సమాధికి సమర్పించారు. బుధవారం ఉదయం అన్నదాన కార్యక్రమం, రాత్రి ఖవ్వాలీ పోటీలు నిర్వహించారు. ఆంధ్రా, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

'సోదరభావంతో మెలిగితే శాంతి'

పెనుకొండ, జూన్ 19 : మనుషులు ఒకరిపట్ల ఒకరు సోదర భావంతో ప్రేమతో మెలిగితే ప్రపంచ శాంతి సిద్ధిస్తుంది చర్చ్ పాస్టర్ పేర్కొన్నారు. స్థానిక బైబిల్ మిషన్ చర్చి బుధవారం మోక్ష మార్గ ప్రవేశ సభలు ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు కొనసాగుతాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాస్టర్ జాన్సన్, బైబిల్ మిషన్ ఏఓ డేవ్ బిందెల రాజు హాజరయ్యారు. స్థానిక పాస్టర్ సుధాకర్ మాట్లాడుతూ క్రైస్తవులందరూ సోదర భావం కలిగి నీతి నియమాలు పాటిస్తూ జీవించాలన్నారు. అనంతరం ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ప్రార్థనలు చేశారు.

ఓటమితో ఉషకి మతి భ్రమించింది

ఈవీఎంలను తప్పుపడుతున్నారు: బీజేపీ నాయకులు

పెనుకొండ టౌన్, జూన్ 19 : రాష్ట్రంలో, పెనుకొండలో వైసీపీ అథఃపాతాళంలోకి వెళ్లడంతో మాజీ మంత్రి ఉషశ్రీచరణ్‌కు మతిభ్రమించి ఈవీఎంలపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని బీజేపీ జిల్లా కార్యదర్శి ఎనుమల రామకృష్ణ మండిపడ్డారు. ఆయన బుధవారం బీజేపీ స్థానిక నాయకులతో కలిసి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. గతంలో వైసీపీ అత్యధిక సీట్లు గెలిచినప్పుడు ఈవీ ఎంలు ఎవరు ట్యాంపరింగ్ చేశారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆరోపణలు చేసేముందు ఆలోచిం చి మాట్లాడాలన్నారు. కళ్యాణదుర్గంలో మీరు చేసిన అవినీతి అందరికీ తెలుసన్నారు. సొంత పార్టీ నాయకులపైనే అక్రమ కేసులు పెట్టించారన్నారు. పెనుకొండకు వచ్చి రాగానే భూదందాలు మొదలుపెట్టారని, అందుకే స్థానిక ప్రజలు మీకు తగిన బుద్ధి చెప్పారన్నారు. కూటమితోనే రాష్ట్రాభివృద్ధి అని ప్రజలు నమ్మి మాకు పట్టం కట్టారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవి, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

పవన్ అభిమానుల సంబరాలు


ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకుంటున్న జనసేన నాయకులు

లేపాక్షి, జూన్ 19 : జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ బుధవారం డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా లేపాక్షిలో ఆయన ఆ పార్టీ నాయకులు, పవన్ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి, పవన్ ఫ్లెక్సీకి పూలమాలలు వేసి, బాణసంచా పేల్చారు. చంద్రబాబు, పవన్ ఆధ్వర్యంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని వారన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పవన్ అభిమానులు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ పోటీల విజేత అనంతపురం


విజేత అనంతపురం జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19: సౌత్‌జోన్ అండర్-23 క్రికెట్ పోటీల్లో అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో అండర్-23 ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ క్రికెట్ ఫైనల్ పోటీలను బుధవారం నిర్వహించారు. కడప, అనంతపురం జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 262 పరుగులు చేసింది. ఇందులో ఖాదర్‌వలీ 61, వీరారెడ్డి 50 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన కడప 34.3 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో అనంతపురం విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో కర్నూలు, చిత్తూరు జట్లు పోటీ పడగా.... మొదట బ్యాటింగ్ చేసిన కర్నూలు 49 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన చిత్తూరు 44 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 222 పరుగులు చేసి గెలుపొందింది. చిత్తూరు బ్యాటర్ ధరణికుమార్ 77 పరుగులు చేశాడు. పాయింట్ల ఆధారంగా అనంతపురం విజేతగా, ద్వితీయ స్థానంలో చిత్తూరు, తృతీయ స్థానంలో కర్నూలు, నెల్లూరు నాలుగో స్థానంలో, కడప ఐదో స్థానంలో నిలిచింది. విజేతలకు సభ్యులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, సెలెక్టర్లు శ్రీహరి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌కు భూములిచ్చిన రైతులతో ముఖాముఖి


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శుభకళ్యాణి

పావగడ, జూన్ 19 : తాలూకా పరిధిలోని ర్యాప్టా గ్రామ పంచాయతీలో బుధవారం సోలార్ విద్యుత్ ఉత్పా దనకు భూము లిచ్చిన రైతులతో సమావేశం నిర్వహించారు. కర్ణాటక సోలార్ పవర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు భూముల ధరల పెంపకంపై నిర్వహించిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో తుమకూరు జి ల్లా కలెక్టర్ శుభకళ్యాణి పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే వివిధ సోలార్ కంపెనీల నుంచి 2600మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రపంచ దేశాలకు అందిస్తోంది. దేశంలో విద్యుత్ అందించేందుకు 4336ఎకరాల్లో సోలార్ విద్యుత్ ఉత్పాదనకు భూములు అందించి రైతులు సహకరించాలని ఆమె కోరారు. మాజీ మంత్రి వెంకటరమణప్ప మాట్లాడుతూ... కంపెనీ ప్రతి ఎకరానికి సంవత్సరానికి రూ.25,200 అందజేస్తుందని తెలిపారు. ఇది నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు.

జూలైలో భద్ర నీటి విడుదల : భద్ర నీటిని వచ్చే జూలై నెలలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేతులమీదుగా విడుదల చేసి పావగడ తాలూకాలోని ప్రతి పల్లెకు అందజేస్తానని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ తెలిపారు. ఆయన బుధవారం తిరుమణిలో రూ.76లక్షల అంచనాతో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం, రూ.29లక్షలతో పశువుల ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ చేశారు. తాలూకాలోని ప్రతి గ్రామానికి సీసీరోడ్లు నిర్మించడానికి రూ.7కోట్ల నిధులు ఇప్పటికే సీఎం మంజూరు చేశారని ఈ యేడాది లోగా పనులకు శ్రీకారం చుడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాని, పంచాయతీ అధ్యక్షుడు లోకేష్, తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకిరాం తదితరులు పాల్గొన్నారు.